## సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలి

### వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి



వికారాబాద్, మార్చి 7 : జిల్లాలో సీసీ రోడ్ల అభివృద్ధి పనులు ఇప్పటివరకు 60 శాతం పనులు పూర్తి చేసుకున్నామని, మిగతా 40 శాతం పనులు కూడా పెండింగ్ ఉంచకుండా పూర్తి చేయాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. జిల్లాలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయిన వాటికి ఎఫ్‌టీవో జనరేట్ చేయాలని, ఎట్టి పరిస్థితిల్లోనూ ఆగకుండా పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్యను పెంచి గ్రామ పరిధిలో జరిగే ఉపాధి హామీ పనులు పూర్తి చేసి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డీఈలు, సంబంధిత శాఖాధికారులున్నారు.



ధరణి ఫిర్యాదులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

## ధరణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

### వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

బషీరాబాద్, మార్చి 7 : ధరణి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. గురువారం బషీరాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ధరణి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమ వివరాలను తెలుసుకున్నారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి, ఇప్పటి వరకు ఎన్ని పరిష్కరింపబడ్డాయి వంటి విషయాలను తహసీల్దార్ కార్యాలయం అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులు ఏమైనా ఉంటే త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు అడిషనల్ కలెక్టర్‌తో మాట్లాడుతూ.. 212 వివిధ రకాల ధరణి ఫిర్యాదులు వచ్చాయని, స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ద్వారా 112 క్లియర్ చేయడం జరిగిందని, 100 ఫిర్యాదులు పరిష్కార దశలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ వెంకటేశ్, ఆర్ఐ రాకేశ్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశం ఉన్నారు.


## 9 మంది విద్యార్థులు డిబార్

వికారాబాద్, మార్చి 7 : ఇంటర్మీడియట్ ద్వితీయ పరీక్షల్లో భాగంగా కాపీ కొడుతూ దొరికిన 9 మంది విద్యార్థులను తెలంగాణ ఇంటర్ బోర్డు పరిశీలకులు డీబార్ చేసినట్టు జిల్లా ఇంటర్ నోడల్ అధికారి శంకర్ తెలిపారు. గురువారం వికారాబాద్ జిల్లాలో కులకచర్ల మండలంలో రెండు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న పరీక్షలను ఇంటర్ బోర్డు పరిశీలకులు పరిశీలిస్తుండగా కాపీ కొడుతున్న 9 మంది విద్యార్థులను పట్టుకున్నట్లు తెలిపారు. గురువారం జరిగిన పరీక్షల్లో జనరల్ కోర్సులో 5124 మంది విద్యార్థులకు 5016 మంది, ఒకేషనల్ కోర్సుల్లో 1273 మంది విద్యార్థులకు 1228 మంది హాజరయ్యారని ఆయన తెలిపారు.

### కూలీనాలీ చేసి..

## ప్రయోజకులుగా మార్చి..

### భర్త తోడు లేకున్నా ఆడపిల్లలకు పెద్ద దిక్కుగా మారిన తల్లి



తల్లి సక్కుబాయితో మంజుల, నాగజ్యోతి

బొంరాస్‌పేట, మార్చి 7 : వ్యవసాయమే జీవనాధారంగా బతుకువెళ్లదీస్తున్న దంపతులు వారు. వారికిద్దరు కూతుర్లు. వ్యవసాయంతో పాటు కూలీనాలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి కుటుంబంలో అనుకోని విషాదం. అకస్మాత్తుగా భర్త మృతిచెందాడు. ఐనా చిన్నతనంలోనే ఆడపిల్లలను ఎట్లా సాకాలి అని, ఎలా చదివించాలని అని ఆలోచిస్తూ కూర్చోలేదామే. భర్త లేకున్నా ధైర్యాన్ని కూడదీసుకుని బతుకు సమరం చేసింది. పిల్లలను బాగా చదివించి మంచి ప్రయోజకులుగా నిలబెట్టింది. తల్లి పడ్డ శ్రమకు తగ్గట్లుగానే ఇద్దరు కూతుర్లు కూడా కష్టపడి చదివి ఉద్యోగాలు సాధించి జీవనం సాగిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బొంరాస్‌పేట మండల కేంద్రానికి చెందిన గొట్టిముక్కుల సక్కుబాయి విజయగాథ ఇది.

బొంరాస్‌పేట మండల కేంద్రానికి చెందిన గొట్టిముక్కుల సక్కుబాయి, సత్యయ్య దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవించేవారు. వారికి మంజుల, నాగజ్యోతి ఇద్దరు కూతుర్లు. పిల్లలు చిన్నతనంలో ఉన్నప్పుడే తండ్రి సత్యయ్య 2002లో మృతిచెందాడు. పిల్లల పోషణభారం మొత్తం తల్లిపై పడింది. భర్త తోడు లేకున్నా సక్కుబాయి ఏమాత్రం అధైర్యపడలేదు. తనకున్న మూడెకరాల పొలం సాగు చేసుకుంటూ కూలీనాలీ పనులు చేసింది. మండల మహిళా సమాఖ్యలో టైలరింగ్ నేర్చుకుంది. కష్టపడి మంజులను ఎంఎస్సీ, బీఈడీ వరకు, నాగజ్యోతిని డిగ్రీ వరకు చదివించింది. మంచి సంబంధాలు చూసి పెళ్లిళ్లు చేసి బాధ్యత తీర్చుకుంది. తండ్రి లేకున్నా తమ కోసం తల్లి పడ్డ శ్రమను వృథాగా పోనివ్వలేదు ఇద్దరు కూతుళ్లు. చదువు పూర్తయిన తరువాత కష్టపడి ఉద్యోగాలు సాధించారు పలువురికి ఆదర్శంగా నిలిచారు. మంజుల ప్రస్తుతం మహిళా కానిస్టేబుల్‌గా పని చేస్తుండగా, నాగజ్యోతి 2012లో ఏపీపీఎస్సీ ద్వారా వీఆర్‌ఏ ఉద్యోగం సాధించింది. ఇటీవలే పదోన్నతి లభించి జూనియర్ అసిస్టెంట్‌గా బొంరాస్‌పేట తహల్దార్ కార్యాలయంలో పని చేస్తున్నది. మహిళా దినోత్సవం సందర్భంగా సమాజానికి ఆదర్శంగా నిలిచిన తల్లీకూతుర్లకు హ్యాట్సాఫ్.

## చేతబడి తొలగిస్తామంటూ బురిడీ

### 10 తులాల బంగారంతో పాటు నగదు కాజేసిన దుండగులు

బంజారాహిల్స్, మార్చి 7: చేతబడి ప్రభావంతో తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నావు.. దాని ప్రభావాన్ని తొలగిస్తాను.. అంటూ నమ్మించి బంగారంతో పాటు నగదును తీసుకుని మోసం చేసిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మినీ గుల్షన్ కాలనీ నివాసి నూర్‌భాను వసీమ్ టీచర్. అనారోగ్యం కారణంగా ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నది. కుటుంబ పోషణ కోసం ఇటీవల ఉద్యోగం చేయాలని నిర్ణయించుకున్న ఆమె.. ఉద్యోగం కోసం ఓఎల్‌ఎక్స్‌తో పాటు ఆన్‌లైన్ సైట్లలో దరఖాస్తు చేసుకున్నది. రెండు నెలల కిందట ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమె వాట్సాప్ నంబర్‌కు మెసేజ్ చేశాడు. ఓ ఫైనాన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాను.. తన సంస్థలో ఉద్యోగం ఇస్తానంటూ చెప్పడంతో.. ఉద్యోగంలో చేరేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆమె తెలిపింది. దీంతో అతడు ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ తదితర వివరాలను ఆమె నుంచి తీసుకున్నాడు. ఆమెతో మాటలు కలిపి కుటుంబ సభ్యుల వివరాలు, ఆర్థిక పరిస్థితులు, ఇబ్బందులు తెలుసుకున్నాడు. ఇబ్బందుల గురించి ఆమె చెప్పడంతో.. వెంటనే ఒక ఫ్యామిలీ ఫొటో.. ఇంటి ఫొటోను పంపించాలని అతడు చెప్పడంతో.. ఆమె పంపించింది. ఆ వివరాలను ముర్షాద్‌కు పంపించి.. దోషాలు తెలుసుకుంటానని చెప్పాడు. కొద్దిసేపటి తర్వాత కాల్ చేసిన అతడు.. మీ పిల్లలు చేతబడికి లోనయ్యారు.. చేతబడిని తొలగించుకోకుంటే చనిపోయే ప్రయాదం ఉన్నదని హెచ్చరించాడు. ఆందోళనకు గురైన బాధితురాలు.. చేతబడి తొలగించే మార్గం చెప్పాలని కోరగా.. ముర్షాద్ వద్ద ప్రత్యేక పూజలు చేయించాల్సి ఉంటుందని, ఇందుకు బాధితురాలికి సంబంధించిన అన్ని ఆభరణాలు 35 రోజుల పాటు పూజలో ఉంచాల్సి ఉంటుందని నమ్మబలికాడు. దీంతో సుమారు 10 తులాల బంగారు ఆభరణాలను అతడికి అందజేసింది. దీంతో పాటు పూజకు అవసరమయ్యే సామగ్రి, ఇతర ఖర్చుల కోసమంటూ పలుమార్లు రూ.1.13 లక్షల వరకు ఆన్‌లైన్‌లో వసూలు చేశాడు. అయితే, రెండు నెలలు గడిచినా తన వద్ద నుంచి తీసుకున్న బంగారు ఆభరణాలు వెనక్కి ఇవ్వకపోగా.. ఫోన్ స్విచ్ఛాఫ్ ఉండటంతో బాధితురాలు మోసపోయినట్లు గుర్తించింది. గురువారం ఆమె ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మహాశివరాత్రికి ముస్తాబు

- అన్ని మౌలిక వసతులను సమకూరుస్తున్న నిర్వాహకులు, అధికారులు
- స్వామివారిని దర్శించుకోనున్న లక్షలాది భక్తులు
- భారీగా పోలీసు బందోబస్తు
- విద్యుత్ కాంతుల్లో ఆలయాలు



భక్తుల కోసం ఏర్పాటు చేసిన బారికేడ్లు


షాద్‌నగర్‌రూరల్, మార్చి 7 : తెలంగాణ కాశీ శైవ క్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన మండలంలోని రామేశ్వరాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మహాశివరాత్రి పర్వదినం రోజున సుమారు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ అధికారి శివకుమార్ తెలిపారు. అన్ని మౌలిక వసతులను సమకూర్చినట్లు తెలిపారు. అలయ పరిసర ప్రాంతంలో సువిశాలమైన ప్రదేశాల్లో ద్విచక్ర వాహనాలు, ఫోర్ వీలర్ వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ సౌకర్యం కల్పించారు. ఆలయ సమీపంలో తాత్కాలికంగా ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు స్వచ్ఛంద సేవాసంస్థల ఆధ్వర్యంలో నాటక ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నారు.



ఉత్తర రామలింగేశ్వరస్వామి



కోనేరులో శివుడి ప్రతిమ



గుట్టపై కొలువుదీరిన పార్వతీదేవి



షాద్‌నగర్‌టౌన్ : శివమారుతిగీతా అయ్యప్ప మందిరం



షాద్‌నగర్‌టౌన్ : ప్రత్యేక అలంకరణలో గిరాజామృత లింగేశ్వరస్వామి

### ప్రత్యేక అభిషేకాలు, దర్శన కార్యక్రమాలు

షాద్‌నగర్‌టౌన్ : పట్టణంలోని శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలోని గిరిజామృత లింగేశ్వరస్వామికి ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు, దర్శన కార్యక్రమాలు ఉంటాయని అర్చకులు తెలిపారు. స్వామివారి దర్శనం కోసం విచ్చేసే భక్తులు క్యూలో వచ్చేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరి, దత్తాత్రేయస్వామి, చౌడమ్మగుట్ట వీరాంజనేయస్వామి, ఆర్టీసీకాలనీ, సాయిబాబా, ఈశ్వర్‌కాలనీల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి.

### విద్యుత్ దీపాలతో ఆలయాల అలంకరణ

ఇబ్రహీంపట్నం : మంచాల మండలం నోముల గ్రామంలోని మల్లికార్జున ఆలయం, ఇబ్రహీంపట్నం త్రిశక్తి ఆలయం, శివాలయం, దండుమైలారం గ్రామంలో పురాతన శివాలయంతోపాటు ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట్, ఆదిబట్ల మున్సిపాలిటీల్లోని వివిధ ఆలయాలను అలంకరించారు. భక్తులు ఆలయాలను సందర్శించే అవకాశమున్నందున అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.



ఇబ్రహీంపట్నం : ముస్తాబైన నోముల మల్లికార్జున స్వామి ఆలయం



పెద్దేముల్ : మండల కేంద్రంలోని శంభులింగేశ్వర ఆలయంలో గురుస్వాములు శేఖర్, రాము, రఘు, గోపాల్, రాములుతోపాటు దాదాపు 25 మంది శివస్వాములు గురువారం గర్భగుడిని పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

### యువతి పేరుతో ట్రాప్..

## హత్య కేసులో నిందితుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

బండ్లగూడ, మార్చి 7: యువతి పేరుతో ట్రాప్‌చేసి.. అత్తాపూర్ పీఎస్ పరిధిలో ఈ నెల 5వ తేదీన జరిగిన యువకుడి హత్య కేసు మిస్టరీ వీడింది. ఐదుగురు నిందితులను గుర్తించిన పోలీసులు.. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇద్దరు యువకుల మధ్య తలెత్తిన గొడవ ఈ హత్యకు దారి తీసిందని పోలీసులు తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వివరాలను వెల్లడించారు. బాలాపూర్‌కు చెందిన ఫహీం (23) పెయింటర్. గత నెలలో నిర్వహించిన జగ్నేకి రాత్‌లో యాసీన్ అనే యువకుడితో ఫహీంకు గొడవ జరిగింది. ఒకరినొకరు చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై పెద్దలు రాజీ కుదిర్చినా.. వారిలో కోపాలు మాత్రం తగ్గలేదు. ఫహీంను ఎలాగైనా చంపాలని యాసీన్ నిర్ణయించుకొని, అతడి స్నేహితులైన ఖురేషి, మహ్మద్ అబ్దుల్ మిన్‌హాజ్, ఖయ్యాం, మహ్మద్ ఫహీంతో కలిసి హత్యకు కుట్ర పన్నారు. ఇందుకోసం ఇన్‌స్టాగ్రాంలో ఒక యువతి ఫొటోతో ఫేక్ అకౌంట్‌ను తెరిచారు. ఆ అకౌంట్ ద్వారా ఫహీంతో రోజూ యువతి మాదిరిగా చాటింగ్ చేశారు. హత్య పథకంలో భాగంగా.. ఈ నెల 5వ తేదీన సులేమాన్ నగర్‌లోని ఎంఎం పహాడ్ భార ఇమామ్ వద్దకు రావాలంటూ యువతి మాదిరిగా మెసేజ్ పెట్టి, పిలిచారు. యువతి పిలుస్తున్నట్టు భావించిన ఫహీం అక్కడికి చేరుకోగానే.. యాసీన్ తన స్నేహితులతో కలిసి దాడిచేసి, హత్య చేశాడు. ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీసీపీ తెలిపారు.

### పిస్తా హౌజ్ హోటల్‌పై దాడి కేసులో..

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిస్తా హౌజ్‌పై ఈ నెల 3వ తేదీన జరిగిన దాడి కేసులో ఆరుగురిని అరెస్టు చేసినట్లు డీసీపీ శ్రీనివాస్ తెలిపారు.

## అర్మేనియాలో ఉద్యోగం పేరుతో మోసం

బంజారాహిల్స్, మార్చి 7 : అర్మేనియా దేశంలో ఉద్యోగమంటూ ఇద్దరిని మోసం చేసిన ఏజెంట్‌పై ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. రాజమండ్రికి చెందిన జువ్వల జార్జ్ ముల్లర్‌కు.. షేక్‌పేటలో కిరీటీ ఓవర్సీస్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్న శ్రీనాథ్ పరిచయమయ్యాడు. అర్మేనియా దేశంలో ఉద్యోగాలు ఉన్నాయని, నెలకు రూ.60 నుంచి 75 వేల వరకు జీతం వస్తుందని శ్రీనాథ్ నమ్మబలికాడు. ఒక్కొక్కరికి రూ.2.54 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో.. తనతో పాటు తన స్నేహితుడు రూపేశ్ కుమార్‌కు కూడా ఉద్యోగం కావాలని జార్జ్ ముల్లర్ చెప్పాడు. ఈ మేరకు గతేడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు వారిద్దరూ కలిసి శ్రీనాథ్‌కు రూ.5.లక్షలు చెల్లించారు. దీంతో ఇద్దరికీ వీసాలు రావడంతో.. సొంత ఖర్చుతో డిసెంబర్ 4న అర్మేనియా వెళ్లారు. అక్కడ దిగిన తర్వాత శ్రీనాథ్‌కు చెందిన ఓ ఏజెంట్ వారిద్దరినీ ఒక హాస్టల్‌లో ఉంచాడు. నెల రోజులు గడిచినా ఉద్యోగం గురించి ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అక్కడ ఖర్చులు పెరిగాయి. దీంతో తిరిగి జనవరి 14న ఇండియాకు వచ్చేశారు. శ్రీనాథ్‌కు పలుమార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. తమను మోసం చేశాడంటూ బాధితుడు జార్జ్ ముల్లర్ గురువారం ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. చీటింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## రూ.50 లక్షల నగదు స్వాధీనం

శేరిలింగంపల్లి, మార్చి 7 : ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.50 లక్షల నగదును రాయదుర్గం పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. రాయదుర్గం మీదుగా భారీ ఎత్తున నగదు తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌వోటీ, రాయదుర్గం పోలీసులు కలిసి ఖాజాగూడ రహదారిపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో బుధవారం అర్ధరాత్రి ఖాజాగూడ రహదారిపై, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సమీపంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఇన్నోవా క్రిస్టా వాహనంలో విక్రమ్ నగేశ్ అనే వ్యక్తిని గుర్తించిన పోలీసులు.. అనుమానంతో అతడి వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. వాహనంలో ఉన్న రెండు బ్యాగుల్లో నగదు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. తాను హెచ్‌పీ గ్యాస్ డీలర్‌నని, సికింద్రాబాద్ నుంచి గుల్బర్గా వెళ్తున్నట్లు విచారణలో విక్రమ్ నగేశ్ తెలిపాడు. నగదుకు సంబంధించిన ఆధారాలు, బిల్లులు లేకపోవడంతో.. పోలీసులు విక్రమ్ నగేశ్‌ను అదుపులోకి తీసుకొని, వాహనం, నగదును సీజ్ చేశారు. పోలీస్ స్టేషన్‌లో నగదును లెక్కించగా.. రూ.50 లక్షలు ఉన్నాయి. విక్రమ్ నగేశ్ వద్ద ఎటువంటి ఆధారాలు, బిల్లులు లేకపోవడంతో అతడిపై కేసు నమోదు చేసిన రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీజ్ చేసిన నగదును ఐటీ శాఖకు అప్పగిస్తామని, ఐటీ నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.



సమీక్షా సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

### పార్లమెంటు ఎన్నికల్లో

## సహాయక పోలింగ్ కేంద్రాలు

### రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

రంగారెడ్డి, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన వివిధ పార్టీల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల మార్పు, సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ.. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో 1500 కంటే ఎక్కువ ఓటర్లుంటే వాటికి సంబంధించి సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు గుర్తింపు ప్రక్రియ కొన సాగుతున్నదని తెలిపారు. ప్రతిపాదించిన సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పా టు, పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పు వివరాలను రాజకీయ పార్టీల ప్రతి నిధులకు ఈ సందర్భంగా వివరించారు. ఆయా పోలింగ్ కేంద్రాలపై ఏమైనా సందేహాలుంటే తెలపాలన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పార్టీల ప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. సమావేశంలో బీఆర్‌ఎస్, బీఎస్పీ, ఎంఐఎం, కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ పార్టీల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ప్రజాప్రతినిధులు

## వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం

### పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, భక్తులు

కడ్తాల్, మార్చి 7 : తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలోని వేదాద్రిగుట్టపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం లక్ష్మీచెన్నకేశవస్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా జరిగింది. దేవతామూర్తులను శుద్ధ జలం, పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, గ్రామ ప్రధాన అర్చకులు నరసింహాశర్మ, శ్రీనివాసమూర్తి, మురళీశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణలు, బ్యాండ్ మేళాలు, ముత్యాల తలంబ్రాలతో లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కల్యాణోత్సవంలో పాల్గొని ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేతోపాటు ప్రజాప్రతినిధులను ఆలయ నిర్వాహకులు సన్మానించారు. అనంతరం ప్రభాకర్‌రెడ్డి, లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

### ఆలయ అభివృద్ధికి రూ.లక్ష అందజేత

ఆలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని మాజీ ఎంపీపీ సీఎల్.శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెల్జాల్ గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి ఆయన రూ.1,00,116, పోశిరెడ్డి నిర్మల, శేఖర్‌రెడ్డి దంపతులు తులం బంగారాన్ని ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, ఎంపీపీ నిర్మల, ఎంపీటీసీ అంబాజీ, మాజీ సర్పంచ్ సంగీత, నాయకులు వెంకట్‌రెడ్డి, విష్ణువర్ధన్‌యాదవ్, యాదయ్య, గోవర్ధన్, విజయ్, శేఖర్, తిరుపతిరెడ్డి, నర్సింహ, సుధాకర్, రమేశ్ భక్తులు పాల్గొన్నారు.



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి డీబీ శీతల్‌ను సన్మానిస్తున్న న్యాయవాది పూజ

వికారాబాద్, మార్చి 7 : మహిళలు ఇంటికి పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని వికారాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సుదర్శన్ అన్నారు. గురువారం వికారాబాద్ కోర్టు ఆవరణలో ఘనంగా మహిళా దినోత్సవం నిర్వహించి వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న మహిళా న్యాయవాదులు, ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, జూనియర్ సివిల్ జడ్జ్ శ్రీకాంత్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రుతి దూత, మహిళా న్యాయవాదులు, కోర్టు మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

### కారును ఢీకొట్టిన వాటర్ ట్యాంకర్

## చిన్నారి మృతి, పలువురికి గాయాలు

బండ్లగూడ, మార్చి 7 : వాటర్ ట్యాంకర్ కారును ఢీకొన్న ఘటనలో చిన్నారి మృతి చెందింది. పలువురు గాయపడ్డారు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని నవాబ్‌సాబ్ కుంట ప్రాంతానికి చెందిన ఓ కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి కారులో చిలుకూరు గ్రామంలో జరిగిన విందుకు హాజరయ్యారు. తిరిగి రాత్రి హైదరాబాద్‌కు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో హిమయాత్‌సాగర్ వద్ద సర్వీస్ రోడ్డు పైనుంచి కారులో వస్తున్నారు. కాగా, హిమయత్‌సాగర్ వైపు వెళ్లే వాటర్ ట్యాంకర్ వేగంగా వచ్చి.. కారును ఢీకొంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా.. ఓ చిన్నారి మృతి చెందింది. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. వాటర్ ట్యాంక్ నడిపిన యజమానిపై కేసు నమోదు చేశారు.

## ఓటు ఎంతో విలువైనది

వ్యవసాయ యూనివర్సిటీ , మార్చి 7 : ఓటు ఎంతో విలువైనదని, కొండా లక్ష్మణ్ తెలంగాణ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా.ప్రశాంత్ అన్నారు. గురువారం కళాశాల ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన 'మేరా పెహలా ఓటు దేశ్‌కే లియే' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనదని, ఓటు అనే ఆయుధంతో మనకు నచ్చిన సరైన వ్యక్తిని పాలకుడిగా ఎన్నుకునే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా ఉన్నత విద్యనభ్యసించే మనం మరింత బాధ్యతగా ఓటు వేయాలన్నారు. చాలా మంది విద్యార్థులకు ఈసారే కొత్తగా ఓటు వేసే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ సంతోషినీ లావణ్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.